క్లుప్తంగా

బస్సు ఢీకొని కలాసీకి గాయాలు

పాలకొండ రూరల్: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో రిక్షా కార్మికుడికి గాయాలయ్యాయి. ఆర్టీసీ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రిక్షా కలాసీగా పనిచేస్తున్న పక్కి ఆదినారాయణ బస్సుపై ఉన్న లగేజీ దించేందుకు సిద్ధమవుతుండగా.. బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో తలకు గాయమైంది. క్షతగాత్రుడిని వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. బాధితుడు ప్రస్తుతం కోలుకుంటున్నట్లు ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

పాలకొండ: విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎం మండల కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెరుగుదలకు నిరసనగా ఈ నెల 30, 31వ తేదీల్లో సంతాకాల సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం నాయకులు దావాల రమణారావు, దూసి దుర్గారావు, ఎ.లక్ష్మణరావు, జి.సారిక తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



జేసీబీతో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

భామిని: మండలంలోని ఘనసరలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. సర్పంచ్ కిల్లారి కమల, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి కిల్లారి ఫాల్గుణరావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు జేసీబీ సాయంలో కాలువల్లో పూడికలు తొలగించి డంప్‌యార్డుకు తరలిస్తున్నారు. మరోవైపు డ్రైనేజీలు లేని వీధుల్లో కొత్తగా కాలువలు నిర్మిస్తున్నారు. గ్రామంలో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ తెలిపారు.


కోటదుర్గమ్మకు సంబర నీరాజనం



కోటదుర్గమ్మ దేవస్థానంకు ఘటాలతో వెళ్తున్న భక్తులు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మకు భక్తులు ఆదివారం సంబరాలు చేపట్టారు. ఇటీవల వివాహాలు చేసుకున్న నూతన వధూవరులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఘటాలతో కాలినడకన ఆలయానికి చేరుకుని అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు. అర్చకులు లక్ష్మీప్రసాద్ శర్మ నేతృత్వంలో విశేష పూజలు చేశారు. శ్రావణమాసం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మ దర్శనం కోసం పోటెత్తారు.

పుట్టగొడుగులకు మంచి డిమాండ్



సహజ సిద్ధంగా లభించే పుట్టగొడుగులు

కురుపాం: ఈ సీజన్‌లో సహజ సిద్ధంగా దొరికే పుట్టగొడుగులకు స్థానికంగా మంచి డిమాండ్ పలుకుతోంది. కేజీ పుట్టగొడుగుల ధర సుమారు రూ.800 వరకు పలుకుతోంది. అడవీ ప్రాంతంలో దొరికే పుట్టగొడుగులను గిరిజనులు సేకరించి స్థానికంగా విక్రయిస్తున్నారు. ప్రకృతి సిద్ధంగా దొరికే ఈ పుట్టగొడుగుల్లో పోషకాలతో పాటు రుచికరంగా ఉండటంతో వీటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది.

హౌస్‌హోల్డ్ సర్వే 95 శాతం పూర్తి

సీతానగరం: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన హౌస్‌హోల్డ్ సర్వే పూర్తి కావచ్చిందని తహసీల్దార్ ఎన్వీ రమణ తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో 18,306 గృహాలు, 62 పోలింగ్ కేంద్రాలుండగా 18,006 గృహాలలో సర్వే నిర్వహించినట్లు చెప్పారు. నిర్దేశించిన 62 పోలింగ్ కేంద్రాల్లో నియమించిన బీఎల్వోలు, 9మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో తనిఖీలు చేశామన్నారు. మొత్తం 95 శాతం సర్వే పూర్తికాగా రెండు రోజుల్లో శతశాతం సర్వే పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, బీఎల్వోలు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

సాగులో సస్యరక్షణే కీలకం

- మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు
- ఆర్‌బీకేల ద్వారా రైతులకు సలహాలు, సూచనలు



రైతులకు సాగులో మెలకువలు వివరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

పాలకొండ రూరల్: రైతులు వరి సాగులో సరైన సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. పంటను ఆశించే తెగుళ్లను ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని, లేదంటే నష్టాలు చవిచూడాల్సి వస్తుందని అంటున్నారు. ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వరి పంట ప్రస్తుతం కీలక దశకు చేరుకుంది. ఈ దశలో పంటకు తెగుళ్లు సోకే అవకాశం ఉండటంతో వ్యవసాయశాఖ సిబ్బంది సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సాగు సలహాలు, సూచనలు అందిస్తూ అన్నదాతకు అండగా ఉంటున్నారు.

జింక్ లోపం, నివారణ..

జింక్ లోపం ఉన్న పంటలో 3 లేదా 4 ఆకులలో ఈనె పాలిపోతుంది. నాటిన 2 నుంచి ఆరు వారాల్లో ముదురాకు మధ్యలో ఈనెకు ఇరువైపులా తుప్పు రంగు మచ్చలు ఏర్పడి, ఆకు పెలుసుగా ఉంటుంది. ఈ లక్షణాలు గుర్తించిన వెంటనే పైరుపై జింక్ సల్ఫేట్ ద్రావణం తగినంత మోతాదులో పిచికారి చేసుకోవాలి.

కాండతొలుచు పురుగు..

నారుమడి నుంచి పూతదశ వరకు వరిపంటకు కాండంతొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంది. పిలక దశలో మొవ్వ చనిపోవడం, పూత దశలో తెల్లకంకులు ఏర్పడడం జరుగుతుంది. దీనివల్ల దిగుబడి బాగా తగ్గిపోతుంది. దీని నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి తగినంత మోతాదులో పిచాకారి చేసుకోవాలి. కార్బోఫ్యూరాన్ 3 గ్రాముల గుళికలు ఎకరాకు పది కిలోలు వాడాలి.

ఆకు ముడత..

గొంగళి పురుగు ఆకుముడతలో ఉండి పత్రహరితాన్ని తినేయడం వలన ఆకులు తెల్లబడతాయి. దీని నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి తగినంత మోతాదులో పిచికారీ చేసుకోవాలి.

సుడిదోమ..

సుడిదోమ వ్యాపిస్తే వరిపొలంలో దోమ ఉధృతి ఉన్న చోట పంట ఎండిపోతుంది. నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. గట్లుపై కలుపు నివారించుకోవాలి.



పొలం పనుల్లో నిమగ్నమైన రైతులు

ఆకుఎండు తెగులు నివారణ..

బ్యాక్టీరియా వలన ఆకు ఎండు తెగులు వస్తుంది. నత్రజని ఎరువులు తక్కువ పరిమాణంలో ఎక్కు సార్లు వేసుకోవాలి. పొలం ఆరబెడుతూ నీటి తడులు ఇవ్వాల్సి ఉంటుంది.

పొట్ట కుళ్లు తెగులు..

వెన్నులు పొట్టలోనే కుళ్లిపోతాయి. దీంతో పంటకు తీవ్ర నష్టం కలుగుతుంది. దీనిని నివారించేందుకు కార్బెండజిమ్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. పొట్టదశలో ఒకసారి, వారం రోజుల తర్వాత రెండోసారి పిచికారి చేసుకోవాలి.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



వరి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి. నీటి యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి. కాలిబాటలు వేసుకోవాలి. చిన్నపాటి మెలకువలు అనుసరించటం వలన పెట్టుబడులు తగ్గడంతో పాటు దిగుబడులు బాగుంటాయి. ఆర్‌బీకేల ద్వారా రైతులను చైతన్యపరుస్తున్నాం.

– కె.రత్నకుమారి, వ్యవసాయశాఖ ఏడీ, పాలకొండ

నీటియాజమాన్యం..

పిలకలు వేసే దశలో, పైరు దుబ్బు వేయడం పూర్తయ్యేవరకు పొలంలో 2 సెంటీ మీటర్ల నీరు ఉండాలి. చిరు పొట్టదశలో, పూత దశలో పొలంలో 5 సెంటీ మీటర్ల నీరు ఉండేలా చూసుకోవాలి. పంట పూర్తిగా వెన్ను వచ్చిన తర్వాత క్రమంగా నీరు తగ్గిస్తూ ఉండాలి.

ఎరువుల యాజమాన్యం..

భూసార పరీక్షలకు అణుగుణంగా రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు వాడి పైరుకు సమతుల్యంగా పోషకాలను అందజేయాలి. ఎకరాకు నత్రజని 96 కిలోలు, భాస్వరం 32 కిలోలు, పొటాష్ 32 కిలోలు అందేలా ఎరువులు వేసుకోవాల్సి ఉంటుంది.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులదే హవా..



రాగోలు అరవింద్‌కుమార్, 6వ వార్డు సభ్యులు, అన్నవరం పంచాయతీ



బొమ్మాళి శాంతమ్మ, 7వ వార్డు సభ్యులు, వీపీ రాజుపేట పంచాయతీ



గురాన శ్రీరాములు, 4వ వార్డు సభ్యులు, నీలానగరం పంచాయతీ



సవర శరత్‌కుమార్, 8వ వార్డు సభ్యులు, కడగండి పంచాయతీ



సున్నాపురం బుద్ధు, 4వ వార్డు సభ్యులు, కీసరజోడు పంచాయతీ



కొండగొర్రి జనార్దనరావు, 3వ వార్డు సభ్యులు, పూతికవలస పంచాయతీ



ఆరిక నవీన్, 2వ వార్డు సభ్యులు, దోనుబాయి పంచాయతీ



తోయక భారతి, 2వ వార్డు మెంబర్, బియ్యాలవలస పంచాయతీ, కురుపాం మండలం



కంకనాల పోలయ్య, 5వ వార్డు మెంబర్, పరశురాంపురం పంచాయతీ, కొమరాడ



రెడ్డి సుందరమ్మ, 10వ వార్డు మెంబర్, గుమడ పంచాయతీ, కొమరాడ మండలం



మండంగి మాణిక్యం, 3వ వార్డు మెంబర్, గొట్టివలస పంచాయతీ, గరుగుబిల్లి



పుచ్చల ప్రసాదరావు, 7వ వార్డు మెంబర్, పెదగుడబ పంచాయతీ, గురుగుబిల్లి

కురుపాం: నియోజకవర్గం పరిధిలో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయకేతనం ఎగురవేశారు. మొత్తం ఒక సర్పంచ్, ఆరు వార్డు మెంబర్ స్థానాలకు ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా.. ఐదు వార్డు మెంబర్ స్థానాలను ఏకగ్రీవంగా కైవసం చేసుకున్నారు. కురుపాం మండలం గుమ్మ పంచాయతీ సర్పంచ్ ఎన్నికకు పోలింగ్ జరగగా.. వైఎస్సార్‌సీపీ బలపరిచిన తోయక గోపాలరావు టీడీపీ మద్దతుదారుపై 54 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కొమరాడ మండలం గుమడ పంచాయతీ 10వ వార్డులో రెడ్డి సుందరమ్మ, పరశురాంపురం పంచాయతీ 5వ వార్డులో కంకనాల పోలయ్య వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గరుగుబిల్లి మండలం గొట్టివలస పంచాయతీ 3వ వార్డులో మండంగి మాణిక్యం, పెదగుడబ పంచాయతీ 7వ వార్డులో పుచ్చల ప్రసాదరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కురుపాం మండలం బియ్యాలవలస పంచాయతీ 2వ వార్డు మెంబర్‌గా తోయక భారతి వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పాలకొండ నియోజకవర్గంలో..

పాలకొండ రూరల్/వీరఘట్టం/సీతంపేట: పాలకొండ నియోజకవర్గంలో వివిధ కారణాలతో ఖాళీ ఏర్పడిన సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. పాలకొండ, వీరఘట్టం, సీతంపేట మండలాల్లో మొత్తం 11 వార్డు మెంబర్ స్థానాలకు, ఒక సర్పంచ్ స్థానానికి ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా, అన్ని చోట్ల అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్ స్థానంతో పాటు ఏడు వార్డు మెంబర్ స్థానాలకు వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు ఎన్నికయ్యారు. పాలకొండ మండలం పనుకువలస సర్పంచుగా కోట మంజుభార్గవి, అన్నవరం పంచాయతీ 6వ వార్డుకు రాగోలు అరవింద్ కుమార్, వీపీ రాజుపేట పంచాయతీలో 7వ వార్డుకు బొమ్మాళి శాంతమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదే కోవలో వీరఘట్టం మండలం నీలానగరం పంచాయతీ 4వ వార్డులో వైఎస్సార్‌సీపీ బలపరిచిన గురాన శ్రీరాములు, సీతంపేట మండలం కడగండి పంచాయతీ 8వ వార్డులో సవర శరత్‌కుమార్, కీసరజోడు పంచాయతీ 4వ వార్డులో సున్నాపురం బుద్ధు, పూతికవలస పంచాయతీ 3వ వార్డుకు కొండగొర్రి జనార్దనరావు, దోనుబాయి పంచాయతీ 2వ వార్డుకు ఆరిక నవీన్, దుగ్గి పంచాయతీ 1వ వార్డుకు ఆరిక ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దోమలను తరమికొడదాం..



పాలకొండ రూరల్: జంపరకోటలో దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

సీతంపేట: దోమలను తరిమి కొడదాం.. మలేరియాను నిర్మూలిద్దామని మలేరియా నివారణా విభాగం సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహనరావు పిలుపునిచ్చారు. జాతీయ దోమల నివారణా దినోత్సవం సందర్భంగా దోనుబాయి పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దోమల వల్ల కలిగే వ్యాధులు, దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం దోమలపై సమరానికి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో దోనుబాయి ఆశ్రమపాఠశాల విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణతో రోగాలకు చెక్

పాలకొండ రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, దోమలను నిర్మూలించడం ద్వారా వ్యాధుల వ్యాప్తికి చెక్ పెట్టొచ్చని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి కడియం చిరంజీవి అన్నారు. మండలంలోని జంపరకోటలో ఆదివారం దోమల నివారణాపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దోమకాటుతో వచ్చే వ్యాధులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సీజన్‌లో రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.

దోమల నివారణకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రవికుమార్, వైద్య సిబ్బంది టి.రామలక్ష్మి, ఎస్.రమ్య, పెంటయ్య తదితరులున్నారు.



సీతంపేట: దోనుబాయిలో దోమల నివారణ ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, వైద్యసిబ్బంది

రిపబ్లికన్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా గడ్డెయ్య

సీతంపేట: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడిగా సీతంపేట మండలం పులిపుట్టికి చెందిన గొర్లె గడ్డెయ్య ఎన్నికయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. విశాఖపట్నంలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కళ్యాణ్, ఉత్తరాంధ్ర కన్వీనర్ గణపతికి గడ్డెయ్య కృతజ్ఞతలు తెలియజేశారు.

● ఆహో ఏమి రుచి



అడవిలో సేకరించిన వెదురు కొమ్ములను చూపుతున్న గిరిజన మహిళలు

కురుపాం: వెదురుకొమ్ములతో వండిన కూరను గిరిజనులు ఎంతో ఇష్టంగా ఆరగించేస్తారు. ఈ సీజన్‌లో గిరిజనులు అడవుల్లో లభించే వెదురు పొదల వద్దకు వెళ్లి వాటి కొమ్ములను సేకరిస్తుంటారు. వాటిని చిన్నచిన్న ముక్కలుగా కోసి కూరగా వండుకుని తింటారు. దీని రుచి దగ్గర చికెన్, మటన్ కూడా సరిపోవని అంటున్నారు. మీరు కూడా ఒకసారి రుచి చూస్తే లొట్టలేసుకుని ఆరగించేస్తారు.

ఆత్మీయ సన్మానం



గౌరీశంకర్ పాత్రోను సన్మానిస్తున్న పరీక్షిత్‌రాజు, తదితరులు

గుమ్మలక్ష్మీపురం: పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే పదవులు వాటంతట అవే వస్తాయని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అన్నారు. తోటపల్లి దేవస్థానం బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన గౌరీశంకర్ పాత్రో సన్మాన కార్యక్రమం ఆదివారం గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ.. చిన్న తిరుపతిగా పేరుగాంచిన తోటపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సేవలు అందించడం ఎంతో అదృష్టమని, భక్తులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు దేవస్థానం అభివృద్ధికి మరింత కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.దీనమయ్య, వైస్ ఎంపీపీ ఎస్.శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్తులకు అండగా సీఎం సహాయనిధి



భామిని: బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: ఆర్తులకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని నల్లరాయిగూడకు చెందిన ఆదివాసీ మహిళ బిడ్డిక జర్మీ(47) కిడ్నీ వ్యాధితో ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి లక్ష రూపాయల ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. సర్పంచ్ బిడ్డిక గుయామీ, బిడ్డిక సోమశేఖర్ తదితరులున్నారు.

వీరఘట్టంలో..

● వీరఘట్టం: పాలకొండకు చెందిన గొర్లె సురేష్ కుమారుడు ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో వైద్య ఖర్చులకు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేశారు. ఆ కుటుంబ పరిస్థితిని ఎమ్మెల్యే కళావతి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.60 వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని వండవలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితుడి తండ్రికి ఎమ్మెల్యే అందజేశారు.

శానిటరీ కార్మికుల సమస్యలపై స్పందించాలి



పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటరీ కార్మికులు, సీఐటీయూ నాయకులు

పాలకొండ/పాలకొండ రూరల్: పాఠశాలలో పనిచేస్తున్న శానిటరీ కార్మికుల సమస్యలపై అధికార యంత్రాంగం స్పందించాలని సీఐటీయూ నాయకులు డి.రమణారావు కోరారు. స్థానిక కార్యాలయంలో శానిటరీ కార్మికులతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారిని సీఐటీయూ అనుబంధ సభ్యులుగా ప్రకటిస్తూ తీర్మానం చేశారు. సీఐటీయూ మండల కమిటీ సమన్వయకర్త కాద రాము నేతృత్వంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బి.చిన్నమ్మడు, కె.రజిని, ప్రధాన కార్యదర్శిగా పి.జ్యోతి, కార్యదర్శిగా పి.గౌరీ, కోశాధికారిగా బి.గౌరీ, డి.నరసమ్మ, టి.ధనలక్ష్మి, డి.కుమారి తదితరులు సభ్యులుగా ఎన్నికయ్యారు. శానిటరీ కార్మికులకు ప్రభుత్వం పీఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం, ప్రమాద బీమా, ఏకరూప దుస్తులు, విధుల నిర్వహణకు కావాల్సిన సామగ్రిని అందజేయాలని కోరారు.

భక్తిమార్గం అనుసరణీయం



ప్రవచనాలు వల్లెవేస్తున్న వక్తలు

పాలకొండ రూరల్: భక్తిమార్గం అనుసరణీయమని ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని బెజ్జి గ్రామంలో ఉన్న శ్రీరామసాయి మందిరంలో ఆదివారం సత్సంగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు భగవద్గీతలోని పలు అంశాలను భక్తులకు వివరించారు. తోటివారికి సాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. భగవంతుని ధ్యానంతో అనేక రుగ్మతల నుంచి ఉపశమనం పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వక్తలు వావిలపల్లి సత్యంనాయుడు, ఎస్.దామోదరరావు తదితరులు గోపూజ ఆవశ్యకతను వివరించారు.

భక్తి భావంతో..



ఆలయ పునరుద్ధరణకు సహకరించాలని కోరుతున్న యువత

భామిని: మండలంలోని బత్తిలిలో వెలసిన పురాతన శివాలయం జీర్ణోద్ధారణకు యువత నడుంకట్టింది. ఈ మేరకు యువకుల బృందం ఆదివారం గ్రామంలో తిరుగుతూ గ్రామస్తులను చైతన్య పరిచారు. శ్రీనీలకంఠేశ్వర ఆలయ పునరుద్ధరణకు విరాళాలు అందించి సహకరించాలని కోరారు. శివాలయం పునరుద్దరణకు పూనుకున్న యువకులను గ్రామస్తులు అభినందించారు.

ముమ్మరంగా గాబుతీతలు



పెదగుడబలో వరిలో గాబుతీస్తున్న మహిళలు

గరుగుబిల్లి: మండలంలో ఖరీఫ్ వరిచేనులో గాబు తీతలు జోరందుకున్నాయి. ముందుగా ఉభాలు పూర్తయిన వరి చేనుల్లో కలుపుతీతలు చేపడుతున్నారు. మండలంలోని బీవీపురం, ఉద్దవోలు, చినగుడబ, పెదగుడబ, వల్లరగుడబ, పెద్దూరు తదితర గ్రామాల్లో గాబుతీత పనుల్లో రైతులు బీజీగా ఉన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పైరు పచ్చగా ఉందని రైతులు అంటున్నారు. వాతావరణం అనుకూలిస్తే ఈ ఏడాది పంట బాగుటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.